
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 28 । జూలై । 2025



సోమశిలలో 29.712 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 29.712 టీఎంసీలు ఉన్నాయి. 12,113 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువ కాలువలకు పెన్నార్ డెల్టాకు 2,570 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,01,240
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,160
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,435
సవర (8 గ్రాములు)	రూ.75,480

గరిష్టం/కనిష్టం
36.5 /28.4

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పొడి ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఆదివారం గాలిలో తేమ 46 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

31న వైఎస్ జగన్ నెల్లూరు రాక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈ నెల 31వ తేదీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన ఖరారైనట్లు ఆ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. 31వ తేదీ గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో నెల్లూరు చెముడుగుంట జిల్లా సెంట్రల్ జైలు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని, అక్కడి నుంచి నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అయి పరామర్శిస్తారన్నారు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకుని తాడేపల్లికి బయలుదేరుతారని తెలిపారు.

హెలిప్యాడ్ పరిశీలన



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తలశిల రఘురాం

వెంకటాచలం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, తలశిల రఘురాం ఆదివారం వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా సెంట్రల్ జైలు సమీపంలోని హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి నెల్లూరులోని మాజీమంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి జగన్ వెళ్లనుండడంతో ఏర్పాట్లపై చర్చించారు. వీరి వెంట పార్టీ ముఖ్య నేతలు తదితరులు ఉన్నారు.

సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ సభ్యుడిగా పర్వతరెడ్డి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ శాసన సభ, శాసనమండలి జాయింట్ కమిటీలో 2025–26 సంవత్సరంలో సబార్డినేట్ లెజిస్లేటివ్ సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కమిటీ సెక్రటరి జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.



సీతారామపురం: బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లపై కానరాని రేకులు



కలిగిరి: ఎస్సీ బాలుర వసతి గృహంలో తలుపుల్లేని కిటికీలు



నెల్లూరులోని ఎస్సీ బాలుర వసతి గదిలో ప్రమాదకరంగా విద్యుత్ మోటారు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఆశల వసతి.. భవిష్యత్ అధోగతి

శిథిల గదులు, వానొస్తే ఉరిసే శ్లాబులు, పగిలిన ఫ్లోర్లు, వెలగని దీపాలు, తిరగని ఫ్యాన్లు, ఆరు బయటే సామూహిక స్నానాలు, కంపు కొట్టే మరుగుదొడ్లు, డోర్లు ఉండవు, నీళ్లు రావు. ఇది జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల స్వరూపం. పేద విద్యార్థుల భవిష్యత్ కార్ఖానాలు.. శిక్షాగారాలే మిన్న అన్నట్లుగా నరక కూపాలుగా ఉన్నాయి. సంక్షేమ వసతిగృహాలు అనేవి విద్యార్థుల్లో నిబద్ధత, అభ్యాసం, జీవిత విజయంపై నమ్మకాన్ని పెంచాలి. కానీ అక్కడ ప్రభుత్వ పర్యవేక్షణ ఉనికే కనిపించడం లేదు. మరమ్మతుల పేరుతో హాస్టళ్లు మూసివేస్తూ, బిల్లులు జాప్యం చేస్తూ విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చడం బాధాకరం. మరో వైపు విద్యార్థులకు చాపలు, దుప్పట్లు ఇప్పటికీ రాలేదు. దోమల దండయాత్ర భయంగా మారింది. 'సాక్షి' నెట్వర్క్ విజిట్‌లో ఎన్నో విషయాలు బయట పడ్డాయి.

సంక్షేమ హాస్టళ్లు నరక కూపాలు

- శిథిల భవనాలు.. చీకటి గదులు
- ఇరుకు గదుల్లో తిరగని ఫ్యాన్లు
- అక్కడే చదువు, నిద్ర
- కంపుకొడుతున్న మరుగుదొడ్లు, డోర్లూ లేవు, నీళ్లు రావు
- స్నానాల గదుల్లేక ఆరుబయటే కానిస్తున్న వైనం
- బోర్లు, కుళాయిల నీళ్లే తాగేందుకు దిక్కు



నెల్లూరు: బందెల దొడ్డిలా.. చిన్న గదిలో పది మందికిపైగా విద్యార్థులను కుక్కిన నెల్లూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు నరకప్రాయంగా మారాయి. పేద వర్గాల విద్యార్థుల చదువుకు పేదరికం ఆటంకం కాకూడదని, వీరంతా బాగా చదువుకోవాలని సర్కారు నిర్వహించే సంక్షేమ వసతి గృహాల ఉద్దేశం పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా కనిపిస్తున్నాయి. నరక కూపానికి నకళ్లుగా కనిపించే హాస్టళ్లల్లో విద్యార్థుల భవిష్యత్ ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లపై ప్రభుత్వం చేసే ప్రచారానికి భిన్నంగా ఉన్నాయి. హాస్టళ్ల భవనాలు పలుచోట్ల మరమ్మతులకు గురికావడంతో వాటిని మూసేశారు. ప్రైవేట్ భవనాల్లో హాస్టళ్లు ఉండడంతో మరమ్మతులకు నోచుకోవడంలేదు. హాస్టళ్లకు ఉపయోగపడని వంట పాత్రలను కాంట్రాక్టర్ల ద్వారా ఇప్పించారు. వీటిని ఉపయోగించలేక ఎస్సీ హాస్టల్ వార్డెన్లు మూలనడేశారు.



కలిగిరి: బాలుర హాస్టల్‌లో తలుపుల్లేని మరుగుదొడ్లు

బాధ్యతలో నిర్లక్ష్యం

జిల్లాలో ఎస్సీ, బీసీ, ఎస్టీ వసతిగృహాలు 162 ఉండగా, ఇందులో 11,864 మంది విద్యార్థులున్నారు. ఈ విద్యా సంవత్సరంలో హాస్టళ్లు ప్రారంభమై నెల దాటిపోయినా అంతంత మాత్రం ఏర్పాట్లతో హాస్టళ్లను నిర్వహించాల్సి వస్తోంది. పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యత ఎంతో వారికి నెల వారీగా ఇచ్చే మెనూ బిల్లులు, కాస్మోటిక్ చార్జీల చెల్లింపుల్లోనే కనబడుతోంది. హాస్టళ్లను మరమ్మతులు చేశాం. బాగా చేర్పించండి అని ప్రచారం చేస్తున్నా.. కానీ హాస్టళ్లలో ఈ సంవత్సరం అంతగా విద్యార్థులు చేరడం లేదు. దానికి కారణం హాస్టళ్లలో దారుణమైన దుర్భరమైన పరిస్థితులే. జిల్లా వ్యాప్తంగా హాస్టళ్ల భవనాలు పలు మరమ్మతులకు రావడంతో పలు చోట్ల హాస్టళ్లను మూసివేశారు. కొన్ని చోట్ల హాస్టళ్లను మార్చారు. మరుగుదొడ్లు, స్నానపు గదుల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది.

ప్రభుత్వ హాస్టళ్లు

	సంఖ్య	విద్యార్థులు
ఎస్సీ	69	4,972
బీసీ	79	3,994
ఎస్టీ	14	2,898

అసౌకర్యాల వసతులు

జిల్లాలో ఉన్న 162 హాస్టళ్లల్లో 98 శాతం బూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. పెచ్చులూడిపోయి ఎప్పుడు కూలిపోదామని ఎదురు చూస్తున్న కనిపించే భవనాల శ్లాబులు, కనీసం సున్నానికి కూడా నోచుకోని, వర్షానికి కారిన నీటి చారికలతో పాచిపట్టిన గదుల గోడల మధ్యనే చదువు, నిద్రతో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. ఇక విద్యార్థులు స్నానం చేసేందుకు ప్రత్యేక గదుల సంగతి అటు ఉంచితే.. కనీసం మరుగుదొడ్లు దుర్భరానికి కేరాఫ్‌గా ఉన్నాయి. దాదాపు అన్ని మరుగుదొడ్లకు డోర్లు ఉండవు, ఉన్నా.. అవి ఊడిపోయి ఉంటాయి. దొడ్లుల్లో కనీసం ఒకటి.. రెండు కాలకృత్యాలకు నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో బక్కెట్లతో పట్టుకెళ్తున్న పరిస్థితి ఉంది. కొన్ని మరుగుదొడ్లపై శ్లాబులు కానీ, రేకులు కూడా లేని దుస్థితి పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లకు ఉపయోగపడని వంట పాత్రలను కాంట్రాక్టర్ల ద్వారా ఇప్పించారు. అంత పెద్ద వంట పాత్రలను ఉపయోగించలేక ఎస్సీ హాస్టల్ వార్డెన్లు మూలన పెట్టేశారు.

మూతపడిన పలు హాస్టళ్లు

జిల్లాలో అనేక హాస్టళ్లను ఈ విద్యా సంవత్సరంలో మూసివేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండేందుకు ఇష్టపడని విద్యార్థులు అడ్మిషన్లు రద్దు చేసుకుని వెళ్లిపోవడంతో మరమ్మతులు చేయించడానికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో మూతవేయక తప్పలేదు. ప్రైవేట్ భవనాలు దొరికితే అందులో కొనసాగిస్తామంటూ చెబుతూ కాలయాపన చేస్తున్నారు. పలు ప్రభుత్వ భవనాల్లో ఉన్న హాస్టళ్లకు వేసవి సెలవుల్లో మరమ్మతులు చేయించారు. అవి విద్యార్థులు ఉండేందుకు కంటే కాంట్రాక్టర్లు లాభపడేందుకే పనికొస్తున్నాయి. హాస్టళ్లు ప్రైవేట్ భవనాల్లో ఉండడం, వాటి మరమ్మతులకు నోచుకోవడం లేదు.



నెల్లూరు: బాలికల వసతి గృహంలో నిరుపయోగంగా పడేసిన ఇనుప పెట్టెలు

చాపల్లేవ్.. దుప్పట్లు ఇవ్వలే..

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ఇవ్వాల్సిన చాపలు, దుప్పట్లు కూడా ఇంత వరకు ఇవ్వలేదు. ఇక వారికి ఏటా అందించే పెట్టెలు కూడా అందించకపోవడంతో తుప్పు పట్టిన పాత పెట్టెలను వాడుకుంటూ విద్యార్థులు కాలాన్ని నెట్టుకొస్తున్నారు. కొన్ని హాస్టళ్లలో అయితే విద్యార్థులకు ఇవ్వాల్సిన ట్రంకుపెట్టెలు గదుల్లో మూలన పడేసి ఉండడం గమనార్హం. జిల్లాలో ఏ ఒక్క హాస్టల్‌లో పడుకోవడానికి మంచాలు లేవు. పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ విద్యార్థులు పెట్టెలు, దుప్పట్లు, చాపలు అన్ని వారే తెచ్చుకోవాలి. ప్రీమెట్రిక్ హాస్టల్‌లో దుప్పట్లు, పెట్టెలు ఇస్తారు. కానీ ఈ ఏడాది ఇంత వరకు సగం హాస్టళ్లలో కూడా ఇవ్వలేదు.

తలుపులు లేని మరుగుదొడ్లు

ఇక్కడ తలుపు లేకుండా దర్శనం ఇస్తున్న మరుగుదొడ్లు మనుబోలు ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కు చెందినవి. ఎప్పటి నుంచో మరుగుదొడ్లకు తలుపులు లేకపోయినా పట్టించుకునే వారు లేరు. ఇక్కడ 40 మంది విద్యార్థులు ఉండి చదువుకుంటున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏక్షణంలో కూలుతుందో అర్థం కాని పరిస్థితి. విద్యార్థులు, మ్యాట్రిన్ బిక్కుబిక్కుమంటు కాలం గడుపుతున్నారు. అద్దె భవనంలోకి మారేందుకు అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇక్కడే భయం గుప్పిట్లో ఉన్నారు.



పొదలకూరు: మనుబోలు ఎస్సీ బాలుర వసతి గృహంలో తలుపుల్లేని మరుగుదొడ్లు

బిక్కుబిక్కుమంటున్నాం



మా హాస్టల్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వరండా గదుల్లో తరచుగా పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని భయపడాల్సి వస్తోంది. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అద్దె బిల్డింగ్‌కి మారేందుకు అవకాశం ఉంటుంది.

– అనిత, సంక్షేమాధికారిణి, ఎస్సీ బాలుర వసతిగృహం, మనుబోలు



నెల్లూరు : చదువుకునే, నిద్రించే ఇరుకైన గది

ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన



మినీబైపాస్ రోడ్డులో పూలే సెంటర్లో నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లూరు (బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల కడుపులు కొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం పిలిచిన టెండర్లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు మెడకు ఉరితాళ్లు తగిలించుకుని వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీనగర్ సీపీఎం ఆఫీస్ సెంటర్ నుంచి పూలేబొమ్మ వరకు మెడకు ఉరితాళ్లు తగిలించుకుని మా కడుపులు కొట్టొద్దు. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించొద్దు అంటూ నినాదాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నెల్లూరు నగర నాయకులు కాయంబు శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి. కామాక్షమ్మ, నాయకులు సలోమి మాట్లాడారు. 13 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు కూటమి ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమన్నారు. ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా కార్మికుల జీవితాలు, ప్రజల ఆరోగ్యాలు ఇబ్బందుల్లో పడుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లకు కార్పొరేట్ కంపెనీలకు కార్మికుల కష్టాన్ని, ప్రభుత్వ సంపదను దోచిపెట్టే విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. సంవత్సరాల తరబడి కార్మికులుగా ఉన్న వారిని కాంట్రాక్టర్ కింద బానిసలుగా మార్చడం బ్రిటిష్ పాలనలోకి తీసుకు వెళ్లడమేనని విమర్శించారు. తక్షణమే పిలిచిన టెండర్లను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు కాపాడుకునేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నెల్లూరు నగర నాయకులు పి సూర్యనారాయణ,కేవీ రమణారెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యమ్మ, కొండమ్మ, చంద్రమ్మ, షబ్బీర్, మనోజ్, రమేష్, రాంబాబు, మునిమోహన్‌బాబు, బాలు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల గ్రావెల్ దందా

కావలి (జలదంకి): కావలిలో టీడీపీ నేతల దందా పరాకాష్టకు చేరింది. కావలి మండలంలోని చెరువుల్లో నీరు అడుగంటడంతో కొద్ది రోజులుగా పగలు రాత్రి తేడా లేకుండా యంత్రాలు పెట్టి ట్రాక్టర్లలో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. రుద్రకోట, కొత్తపల్లి, ఆముదాలదిన్నె తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఆముదాలదిన్నె చెరువులో మూడు జేసీబీలు పెట్టి దాదాపు 70 ట్రాక్టర్లతో గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. ఇటీవల కొత్తపల్లి చెరువులో గ్రావెల్ అక్రమ తరలింపుపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా సంబంధిత అధికారులు గ్రావెల్ అక్రమ దందాను అడ్డుకోలేదు. గ్రావెల్ అక్రమ రవాణాపై అధికారుల చర్యలు లేకపోవడంతో పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ అక్రమ వ్యాపారం జోరుగా కొనసాగిస్తూ తెలుగు తమ్ముళ్లు లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ హరీష్‌ను వివరణ కోరగా గ్రావెల్ తరలింపునకు అనుమతులు ఇచ్చామన్నారు. 70 ట్రాక్టర్లతోపాటు మూడు జేసీబీలతో గ్రావెల్ తరలింపునకు ఎలా అనుమతి ఇస్తారని అడుగగా ఫోన్ కట్ చేశారు.



ఆముదాలదిన్నె చెరువు నుంచి అక్రమంగా గ్రావెల్‌ను ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం

టీడీపీలో ఏఎంసీ కుంపటి

- ఉదయగిరి ఛైర్మన్ శాంతమ్మకు రాకుండా కాకర్ల కుతంత్రం
- ఆమెకు కాకుండా పార్టీలో మరొకరికి ఇస్తే ఇబ్బందులని..
- బీజేపీ నేత విజయలక్ష్మికి కేటాయించేలా వ్యూహం
- మేకపాటి చంద్రశేఖరరెడ్డికి రాజకీయంగా చెక్ పెట్టే ప్రయత్నం



మేకపాటి శాంతమ్మ



విజయలక్ష్మి

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి టీడీపీలోనే కాకుండా కూటమిలో భాగస్వామి అయిన బీజేపీలోనూ కుంపటి రాజేస్తోంది. ఆ పదవి తన సతీమణి మేకపాటి శాంతకుమారికి దక్కేలా మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ఇప్పటికే పావులు కదిపి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే మేకపాటిని రాజకీయంగా దూరంగా చేయాలని తాజా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కుతంత్రాలకు తెరతీశారు. ఉదయగిరి ఏఎంసీ ఛైర్మన్ మహిళకు కేటాయించడంతో పార్టీ అధిష్టానం వద్ద ఉన్న పరపతితో వింజమూరుకు చెందిన టీడీపీ నేత గణపం సుదర్శన్‌రెడ్డి సతీమణి హరిత పేరును ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. ఈ క్రమంలో మేకపాటి చంద్రశేఖరరెడ్డి పలుమార్లు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కలిసి ఉదయగిరి ఏఎంసీ పదవి తన సతీమణికి ఇవ్వాలని నివేదించినట్లు సమాచారం. ఉదయగిరి అసెంబ్లీ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తాను తమ కుటుంబ కలహాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరాను. ఎలాంటి ముందస్తు షరతులు లేకుండా భేషరతుగా టీడీపీ విజయం కోసం పని చేశాను. తమ కుటుంబం నుంచి తన సోదరుడు పోటీ చేసినా, టీడీపీ ప్రకటించిన అభ్యర్థి విజయం కోసం శ్రమించాను. ప్రస్తుతం ఈ అవకాశం తన సతీమణికి ఇవ్వాలని చంద్రబాబును కోరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల కుట్రలకు తెరతీసినట్లు సమాచారం. మేకపాటి శాంతకుమారికి ఛైర్మన్ పదవి ఇస్తే ఉదయగిరిలో గ్రూపు రాజకీయాలు పెరుగుతాయని, ఈ పరిణామాలు భవిష్యత్‌లో టీడీపీకి ఇబ్బందిగా మారే అవకాశం ఉందని మంత్రి లోకేశ్ ద్వారా మేకపాటి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేగా తాను సూచించిన వారికి ఇచ్చినా ఇబ్బందులు వస్తాయని, గణపం కుటుంబానికి వెన్నుపోటు పొడుస్తూ సరికొత్త వ్యూహానికి తెర తీశారు.

మేకపాటికి చెక్‌పెట్టే యోచనతో బీజేపీకి..

మేకపాటి చంద్రశేఖరరెడ్డికి చెక్ పెట్టేందుకు ఎమ్మెల్యే నుంచి పార్టీ అధిష్టానం వరకు డ్రామాకు తెరతీసినట్లు తెలుస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు సూచనలు మేరకు ఎమ్మెల్యే కాకర్ల ఉదయగిరి ఏఎంసీ ఛైర్మన్ పదవి బీజేపీకి కేటాయిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి చెప్పారు. ఈ క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి మండల పార్టీ అధ్యక్షురాలు పాలగుల్ల విజయలక్ష్మి పేరు సిఫార్సు చేశారు. ఉదయగిరి బీజేపీ నేతలను సంప్రదించకుండా ఆమె పేరు సూచించడంపై కూడా ఆ పార్టీలో దుమారం చెలరేగింది. పలువురు ఆశావహులు తమకు అవకాశం కల్పించాలని రాష్ట్ర అధ్యక్షుడు మాధవ, బీజేపీ మంత్రి సత్యకుమార్ వద్ద పంచాయితీ పెట్టారు. దీంతో రాష్ట్ర అధినాయకత్వం ఏకాభిప్రాయంతో ఒక నిర్ణయం తీసుకుంటామని సర్ది చెప్పినట్లు తెలుస్తోంది.

రగిలిపోతున్న మేకపాటి

ఉదయగిరిలో తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్న మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఆరుసార్లు పోటీ చేసి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019 ఎన్నికల అనంతరం ఆయన సతీమణి శాంతకుమారి రాజకీయ రంగ ప్రవేశం చేయడంతో మేకపాటి కుటుంబంలో అన్నదమ్ముల మధ్య విభేదాలు తలెత్తాయి. చంద్రశేఖరరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే శాంతకుమారిని ఉదయగిరి ఏఎంసీ ఛైర్మన్ చేయాలని భావించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజకీయ పరిణామాల నేపథ్యంలో చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్‌సీపీని వదిలి బేషరతుగా టీడీపీ గూటికి చేరారు. ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోయినా టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన కాకర్ల సురేష్ విజయం కోసం కృషి చేశారు. టీడీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ బోర్డు మెంబరు లేదా ఉదయగిరి ఏఎంసీ ఛైర్మన్ అవకాశం తన సతీమణి శాంతమ్మకు కల్పించాలని చంద్రబాబును కోరారు. టీడీటీ బోర్డుకు అవకాశం ఇవ్వకపోవడంతో కనీసం ఏఎంసీ ఛైర్మన్ అయినా ఇస్తార ని భావించారు. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో ఆ ఆశలకు చెక్ పెడుతూ ఉదయగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బీజేపీకి కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించడంతో మేకపాటి లోలోన రగిలిపోతున్నట్లు సమాచారం. చంద్రబాబు తనను మోసం చేశారని అనుచరుల వద్ద వాపోతున్నట్లు తెలుస్తోంది. అయితే చంద్రశేఖరరెడ్డి రాజకీయ భవిష్యత్ నిర్ణయంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

లారీకి మార్గం చూపుతూ..

- ప్రమాదం జరిగి గుమాస్తా మృతి

నెల్లూరు(క్రైమ్): రైస్‌మిల్లులోకి వెళ్లేందుకు లారీకి మార్గం చూపిస్తుండగా ప్రమాదవశాత్తు లారీ – గోడ మధ్యలో నలిగి తీవ్రగాయాలైన గుమాస్తా మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని మూలాపేట పరమేశ్వరి నగర్‌కు చెందిన జి.సురేష్ (46), శారద దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. సురేష్ నగరంలోని బియ్యం దళారుల వద్ద గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అతను ఆదివారం లక్ష్మీపురంలోని ఓ రైస్‌మిల్లులో బియ్యాన్ని లారీలో లోడ్ చేయించేందుకు వెళ్లాడు. ఈక్రమంలో సురేష్ లారీ రైస్‌మిల్లులోకి వెళ్లేందుకు డ్రైవర్‌కు ముందు నుంచి మార్గం చూపిస్తున్నాడు. డ్రైవర్ వేగంతో లారీని ముందుకు కదిపాడు. దీంతో లారీ – గోడ మధ్యలో సురేష్ నలిగిపోయారు. అక్కడున్న వారు అతడిని బృందావనంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంతలో మునిగిపోయి వ్యక్తి మృత్యువాత

కావలి(జలదంకి): చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గుంతలో మునిగిపోయి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామానికి చెందిన వేటగిరి శీనయ్య (40), నాగరాజు, కామాక్షయ్య ఆదివారం ఉదయం కృష్ణంరాజు గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో శీనయ్య లోతుగా ఉన్న ప్రాంతంలో మునిగిపోయాడు. తోటివారు అతడిని ఒడ్డుకు తీసుకురాగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కావలి రూరల్ ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు డ్రైవర్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కారు డ్రైవర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు పొదలకూరు రోడ్డులోని ఎన్‌సీసీ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన తరుణ్‌తేజ (27), ప్రవల్లిక దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. తరుణ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకోసాగాడు. అతడికి నాలుగేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన యువతితో పరిచయమైంది. ఇద్దరూ సన్నిహితంగా ఉండసాగారు. ఈ విషయమై దంపతుల నడుమ విభేదాలు వచ్చాయి. భార్య పుట్టింటికి వెళ్లిపోయి భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం తరుణ్ తన స్నేహితురాలితో కలిసి నెల్లూరు ఎన్‌సీసీ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ప్రవల్లికకు విడాకులు ఇవ్వాలంటూ కొంతకాలంగా ఆమె ఒత్తిడి తెస్తూ గొడవ పడుతోందని, భార్యను వదిలి తప్పు చేశానని అతను తన తల్లి శిరీషకు చెప్పి బాధపడ్డాడు. ఆదివారం అశోక్ అనే వ్యక్తి శిరీషకు ఫోన్ చేసి తరుణ్ తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. దీంతో ఆమె తన కోడలితో కలిసి నెల్లూరుకు చేరుకుంది. విగతజీవిగా పడి ఉన్న తరుణ్‌ను చూసి వారు కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత తల్లి అక్కడున్న వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుమారుడి మృతిపై పలు అనుమానాలున్నాయని శిరీష వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 27.2 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 27.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,100, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, మొదటిబ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

1న నృసింహునికి చందనాలంకారం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి ఆగస్ట్ 1న చందనాలంకారంలో దర్శనమివ్వనున్నట్లు దేవస్థాన అధికారులు ఆదివారం తెలిపారు. ఆ రోజు స్వాతినక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం కావడంతో ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడ సేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 134
లేయర్ (లైవ్) : 112
బ్రాయిలర్ చికెన్ : 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 190



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.26
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



హెపటైటిస్‌తో ముప్పు

లివర్‌కు డేంజర్
- నిర్లక్ష్యం చేస్తే సిర్రోసిస్, కేన్సర్ వచ్చే అవకాశం
- జిల్లాలో 25 వేల మందికి పైగా రోగులు
- వ్యాక్సిన్‌తోనే నియంత్రణ
- నేడు ప్రపంచ హెపటైటిస్ డే

నెల్లూరు(అర్బన్): హెపటైటిస్ వైరస్ గురించి చాలామందికి తెలియదు. కామెర్లు (పసిరికలు) అంటే అర్థమవుతుంది. హెపటైటిస్ వైరస్‌లు శరీరంలోని అతి పెద్ద గ్రంధి అయిన లివర్ (కాలేయం)పై పెనుప్రభావాన్ని చూపుతాయి. ప్రధానంగా ఐదు రకాలున్నా వాటిలో పైకి కామెర్లు రూపంలో కనిపించే ఏ రకం వైరస్ అంత ప్రమాదకరం కాదు. వైద్యుల సలహాలు తీసుకుని మూడు వారాలు విశ్రాంతి తీసుకుంటే తగ్గిపోతుంది. అయితే పైకి ఎలాంటి లక్షణాలు కనిపించకుండా రక్తంలోనే జీవితాంతం ఉండే హెపటైటిస్ బీ, సీ వైరస్‌తోనే ముప్పు ఉంటుంది. లివర్ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ప్రస్తుతం ఇవి రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 నాటికి ఈ వ్యాధిని అంతం చేయాలని పిలుపునిచ్చింది. ప్రతి సంవత్సరం జూలై 28వ తేదీని ప్రపంచ వైరల్ హెపటైటిస్ డేగా ప్రకటించింది. జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



పెరుగుతున్న కేసులు

జిల్లాలో హెపటైటిస్ బీ, సీ రకం కేసులు ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సీనియర్ డాక్టర్ల అంచనా మేరకు 25 వేల మందికి పైగా రోగులున్నట్లు తెలుస్తోంది. బీ, సీ వైరస్ సోకిన వ్యక్తితో లైంగిక సంబంధం కలిగి ఉన్నవారి వల్ల ఎక్కువగా వ్యాప్తి చెందుతోంది. అలాగే రక్త మార్పిడి, ఒకే నీడిల్ కలిగి ఉన్న సిరంజ్‌తో మత్తు ఇంజెక్షన్లు వినియోగించే యువతలో ఈ తరహా కేసులు నమోదవుతున్నాయి. అతిగా మద్యం సేవించే వారిలో ఆల్కాహాలిక్ హెపటైటిస్ బారిన పడుతున్నారు. మురికివాడలు, డయాలసిస్ కేసులు, హెచ్‌ఐవీతో బాధపడే వారిలో ఎక్కువగా బీ, సీ వైరస్ కనిపిస్తోంది. కొంత మందిలో తల్లి నుంచి బిడ్డకు సోకుతోంది.

స్క్రీనింగ్ పరీక్షలెక్కడ?

ఈ జబ్బు గురించి వైద్యశాఖలో లెక్కల్లేవు. జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 10 సీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆస్పత్రి, రెండు ఏరియా, నెల్లూరు నగరంలో ప్రభుత్వ పెద్దాస్పత్రి ఉన్నాయి. సర్వజన ఆస్పత్రిలో అరకొరా మినహా ఇక ఎక్కడా స్క్రీనింగ్ పరీక్షలు చేయడం లేదు. ఆపరేషన్ సందర్భాలతోపాటు డయాలసిస్, హెచ్‌ఐవీ రోగులు, ఖైదీలు జీజీహెచ్‌కు వచ్చినప్పుడు పరీక్షలు చేస్తున్నారు. ఇంకా ప్రజలు స్వచ్ఛందంగా కోరితే సరే. ఆస్పత్రిలో హెపటైటిస్‌కు వైరల్ లోడ్ పెరగకుండా చికిత్స అందిస్తున్నారు. ప్రజలు ఉచితంగా ఇక్కడ సేవలు పొందవచ్చు.

పెద్దాస్పత్రిలో పరిశీలిస్తే..

పెద్దాస్పత్రిలో హెపటైటిస్ – బీకి సంబంధించి 2022లో 14,684 మందికి పరీక్షలు చేస్తే వారిలో 205 మందికి, 2023లో 21,837 మందికి గానూ 404కి మందికి పాజిటివ్ వచ్చింది. 2024 జనవరి నుంచి జూలై వరకు 13,405 మందికి పరీక్షలు చేయగా 262 మందికి వైరస్ ఉన్నట్టు తేలింది. అలాగే సీ – వైరస్‌కు సంబంధించి 2022 నుంచి 2024 జూలై వరకు 31 వేల మందికి స్క్రీనింగ్ చేయగా 73 మందికి పాజిటివ్ వచ్చింది. డయాలసిస్ చేయించుకుంటున్న వారికి 2023, 2024లో 93 మందికి స్క్రీనింగ్ నిర్వహించగా 13 మందికి సీ వైరస్ ఉన్నట్టు తేలింది. మరో ముగ్గురికి బీ వైరస్ సోకింది. 7,961 మంది ఏఆర్‌టీ రోగులకు పరీక్షలు చేయగా 224 మందికి హెపటైటిస్ బీ సోకింది. 2024లో 388 మంది ఖైదీలకు పరీక్షలు చేయగా వారిలో నలుగురికి బీ వైరస్ ఉన్నట్టు తేలింది.

అవగాహనతోనే చెక్



సీ వైరస్‌కు కొత్తగా చికిత్స అందుబాటులోకి వచ్చింది. పరీక్షలు చేయించుకుని మూడునెలలు మందులు వాడాలి. బీ వైరస్‌ను నయం చేయలేం. అయితే వైరల్ లోడ్ పెరగకుండా మూడు నుంచి నాలుగేళ్లు డాక్టర్ల పర్యవేక్షణలో మందులు వాడాలి. ప్రజల్లో అవగాహన పెరగాలి. ముందస్తుగా రక్తపరీక్షలు చేయించుకుని వ్యాధి ఉందో? లేదో? తెలుసుకోవాలి. లేనివారు వ్యాక్సిన్ వేయించుకోవాలి. గర్భిణికి వైరస్ ఉంటే బిడ్డ పుట్టిన రోజే ఇమ్యునో గ్లోబులిన్ ఇంజెక్షన్ వేయించాలి.

– డాక్టర్ సునీల్‌కుమార్, హెపటైటిస్ జిల్లా నోడల్ ఆఫీసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

పెద్దాస్పత్రిలో ఉచిత పరీక్షలు, వైద్యం



నెల్లూరులోని సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో పెద్ద సంఖ్యలో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. ముందస్తుగా ఎవరైనా వచ్చి హెపటైటిస్ వైరల్ పరీక్షలు చేయించుకోవచ్చు. ఇందుకు ఒక విభాగాన్ని ఏర్పాటు చేశాం. ఎవరికైనా పాజిటివ్ వస్తే వారికి మళ్లీ వైరల్ లోడ్ పరీక్షలు చేస్తాం. ఖరీదైన మందులు ఉచితంగా అందజేస్తాం. మందులు వాడటం ద్వారా వ్యాధి ముదరకుండా నియంత్రణ చేయొచ్చు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. అలాగే ప్రతి ఒక్కరూ ముందస్తుగా టీకాలు వేయించుకోవాలి.

– డాక్టర్ కొండేటి మాధవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

నిద్రలోనే అనంతలోకాలకు..

- ట్రాక్టర్ తొక్కడంతో బాలుడి మృతి
- వాహన యజమాని టీడీపీ నాయకుడు
- కేసు లేకుండా చేసేందుకు ప్రయత్నం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సోమశిల: నిద్రపోతున్న బాలుడిని ట్రాక్టర్ తొక్కడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి సమీపంలోనీ ఉత్తరకాలువ పక్కనుండే షెల్టర్‌లో మానికల శీనయ్య, చెంచమ్మ అనే గిరిజన కుటుంబం నివాసం ఉంటోంది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడైన నాగరాజు (7) శనివారం రాత్రి షెల్టర్ వెనుక భాగంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో తండ్రితోపాటు నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి ట్రాక్టర్‌ను కమ్మవారిపల్లి నుంచి తీసుకెళ్తూ నిద్రపోతున్న నాగరాజును తొక్కించడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. మృతదేహాన్ని పీకే పాడు పెన్నానదిలో పూడ్చి పెట్టారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై సమాచారం తెలుసుకున్న సోమశిల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- కాగా వాహన యజమాని టీడీపీకి చెందినవాడు. కేసు లేకుండా చేసేందుకు అతను తమ నేతల ద్వారా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

కరేడు చుట్టూ పోలీస్ ఆంక్షలు

- సభలు, సమావేశాలు పెట్టొద్దని ఆదేశాలు
- నాయకులు వెళ్లకుండా చర్యలు



కరేడు ర్యాంపు వద్ద పోలీసులు

ఉలవపాడు: కరేడు, ఉలవపాడులో పోలీస్ ఆంక్షలు అమలవుతున్నాయి. శనివారం గిరిజనుల అరెస్ట్, ఆపై పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించిన నేపథ్యంలో ఆదివారం గ్రామాల్లో భారీగా పోలీస్ సిబ్బందిని మోహరించారు. ఉలవపాడు నుంచి కరేడు గ్రామానికి వెళ్లే అలగాయపాళెం రోడ్డు, దర్గా సెంటర్, హైవేలోని కరేడు ర్యాంపు వద్ద పికెట్ పెట్టారు. కరేడుకు కొత్త వ్యక్తులు ఎవరూ వెళ్లకుండా తనిఖీలు చేస్తున్నారు. గ్రామంలో అన్ని ప్రధాన కేంద్రాల్లో పోలీసుల్ని పెట్టారు. ధర్నా నిర్వహించిన తర్వాత ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించాలని, గ్రామస్తులతో మాట్లాడాలని కొన్ని ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు నిర్ణయించారు. అయితే వారెవరూ గ్రామాల్లోకి రాకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆపేస్తున్న పోలీసులు

సీపీఎం నాయకుడు కుమార్ కరేడు వెళ్తారనే సమాచారంతో ఆదివారం ఉదయం కందుకూరులోనే అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఉంచి సాయంత్రం పంపించారు. స్థానికంగా ఉన్న వైఎస్సార్‌సీపీ, కందుకూరు నుంచి నాయకులు రాకుండా ఆపేస్తున్న పరిస్థితి ఉంది. ఉద్యమం పెరుగుతుందనే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఈనెల 31 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. కందుకూరు సబ్ డివిజన్ పరిధి మొత్తం అమలులో ఉంటుందని డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలియచేశారు. కరేడు ప్రాంతంలో సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, బయట వ్యక్తుల జోక్యంతో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నలుగురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 10 మంది ఎస్సైలతోపాటు సుమారు 200 మందితో బందోబస్తును ఏర్పాటు చేశారు.

వెంకటాచలంలో అడ్డగింత

వెంకటాచలం: కరేడుకు వెళ్తున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్‌ను వెంకటాచలం పోలీసులు ఆదివారం ఉదయం టోల్‌ప్లాజా వద్ద అడ్డుకున్నారు. ఆ గ్రామంలో శాంతిభద్రతల సమస్య ఉందని, అనుమతించేది లేదని చెప్పారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య కొంతసేపు వాదనలు జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు ఒప్పుకోకపోవడంతో రామచంద్ర యాదవ్ వెళ్లిపోయారు. ఆయన మాట్లాడుతూ కరేడు రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని తెలియజేశారు.



రామచంద్ర యాదవ్‌ను అడ్డుకున్న పోలీసులు

వైద్యశాలకు వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో అధ్యాపకురాలి మృతి



షాజిదా బేగం (ఫైల్)



ఘటనా స్థలంలో కారు

కందుకూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు గాయపడిన ఘటన మండలంలోని ఓగూరు సమీపంలో 167–బీ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కందుకూరు కోవూరు రోడ్డులోని యర్రగుంటపాళేనికి చెందిన పఠాన్ షాజిదా బేగం (55) తన కుమారుడు తబీస్‌తో కలిసి ఒంగోలులోని వైద్యశాలకు వెళ్తున్నారు. అది వారి సొంత కారు. తబీస్ డ్రైవింగ్ చేస్తున్నాడు. ఓగూరు సమీపంలోని రవి గార్డెన్ వద్ద డీసీఎం లారీ వేగంగా వెళ్తోంది. డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న కారు దానిని ఢీకొట్టింది. షాజిదా బేగం తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను 108 అంబులెన్స్‌లో ఒంగోలు వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందారు. తబీస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. షాజిదా బేగం దొనకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విచారణ చేస్తున్నట్లు కందుకూరు రూరల్ పోలీసులు తెలిపారు.

ఘనంగా కృష్ణచైతన్య సక్సెస్ మీట్

నెల్లూరు(టౌన్): కృష్ణచైతన్య విద్యాసంస్థలు నాక్ అక్రిడిటేషన్, యూజీసీ అటానమస్ సాధించడంతో నెల్లూరులోని అనిత ఆడిటోరియంలో ఆదివారం సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ కృష్ణచైతన్య విద్యాసంస్థలు క్రమశిక్షణ కలిగిన విద్యావిధానానికి స్ఫూర్తిగా నిలుస్తున్నట్లు చెప్పారు. అనంతరం అక్రిడిటేషన్, యూజీసీ అటానమస్ సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డీన్ రామాంజనేయులురెడ్డి, డిగ్రీ కళాశాలల డీన్ సుధారాణి, పీజీ కళాశాలల డీన్ జ్యోతి, ప్రిన్సిపల్ నాగయ్య, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.



సక్సెస్ మీట్‌లో యాజమాన్యం, అధ్యాపకులు

విద్యతోనే సమాజంలో గౌరవం

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

నెల్లూరు(బృందావనం): విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్న విషయాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకుని కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ తిరగాబత్తిన శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం కార్యక్రమాన్ని జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నెల్లూరులోని పురమందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత పారిశ్రామికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ దివంగత కోసూరు గోవిందయ్య ట్రస్ట్ తరఫున విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక నగదుతోపాటు విద్యాసామగ్రి అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది 193 మందికి ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో గౌడ సంఘ నేతలు రావుల దశరథరామయ్యగౌడ్, నాయుడు రామ్‌ప్రసాద్‌గౌడ్, డాక్టర్ బడుగు కృష్ణమూర్తి గౌడ్, డాక్టర్ బి.మాధవులు, డాక్టర్ వెంకటాచలపతిగౌడ్, ప్రొఫెసర్ రావుల లావణ్యగౌడ్, దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావుగౌడ్, సీఐ జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారం అందజేస్తున్న గౌడ సంఘ నేతలు

కొరవడిన నిఘా



నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్

- పోలీసుల పర్యవేక్షణ లోపం
- పనిచేయని సీసీ కెమెరాలు
- ప్రయాణికులకు భద్రత కరువు
- ఇదీ బస్టాండ్లలో పరిస్థితి

నెల్లూరు సిటీ: నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్లలో నిఘా కొరవడింది. ప్రయాణికుల రద్దీ ఉండే చోట సీసీ కెమెరాలు కొన్ని పనిచేయకపోవడం, పర్యవేక్షణ లోపం కారణంగా జేబుదొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొన్ని కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. మరికొన్నింటిని దుకాణాల వైపు తిప్పి పెట్టారు. దీంతో ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకమైంది.

కొన్ని మాత్రమే..

నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో 12 సీసీ కెమెరాలుండగా అందులో 8 పనిచేస్తున్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు ఆర్టీసీ బస్టాండ్‌లో 9 కెమెరాలుండగా 6 పనిచేస్తున్నాయి. ఈ రెండు డిపోల పరిధిలో నిత్యం 20 వేల నుంచి 30 వేల మంది ప్రయాణికులు పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రామాల నుంచి వందల సంఖ్యలో నెల్లూరుకు వస్తుంటారు. వారి భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరం చాలా ఉంది.



ఆర్టీసీ డిపో–1లో దుకాణాల వైపు తిరిగి ఉన్న సీసీ కెమెరా

తూతూమంత్రంగా..

వేల సంఖ్యలో ప్రయాణికులతో కిక్కిరిసి ఉండే బస్టాండుల్లో స్థానిక పోలీసుల పర్యవేక్షణ 24 గంటలూ ఉండాలి. అయితే ఒకరిద్దరు సిబ్బందిని కేటాయించినా వారు విధుల్లో తూతూమంత్రంగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. వస్తువులు, పర్సులు పోగొట్టుకున్న ప్రయాణికులు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోతోందని ఆరోపణలున్నాయి. పోలీసులు నిఘాను పెంచాల్సి ఉంది.